రైతు రాజిరెడ్డికి అండగా ఉంటాం

రైతు రాజిరెడ్డిని పరామర్శిస్తున్న రెడ్డి సంఘ జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి, రెడ్డి సంఘం నేతలు

- జిల్లా రెడ్డి సంఘం అధ్యక్షుడు కృష్ణారెడ్డి
- జైలు నుంచి విడుదలైన రాజిరెడ్డిని పరామర్శించిన రెడ్డి సంఘ నేతలు

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 27: అక్రమ కేసులో జైలుకు వెళ్లిన తంగళ్లపల్లి మండలం జిల్లెలకు చెందిన రైతు అబ్బిడి రాజిరెడ్డి బుధవారం జైలు నుంచి విడుదలయ్యాడు. మాజీ మంత్రి కేటీఆర్ చొరవతో బెయిల్ మంజూరై, విడుదలై ఇంటికి చేరిన విషయం తెలిసిందే. ఈ మేరకు గురువారం రెడ్డి సంఘ జిల్లా అధ్యక్షుడు గుండారపు కృష్ణారెడ్డి, రెడ్డి సంఘ నేతలు పరామర్శించారు. రాజిరెడ్డికి అండగా ఉంటామని భరోసా నిచ్చారు. అక్రమ కేసులతో రైతులను వేధించడం సరికాదని పేర్కొన్నారు. సంఘం మండలాధ్యక్షుడు యేసిరెడ్డి రాంరెడ్డి, మాజీ సింగిల్ విండో చైర్మన్ పబ్బతీ విజయేంద్రారెడ్డి, కృష్ణారెడ్డి, మాట్లా మధు, మోహనరెడ్డి, రెడ్డి సంఘ నేతలు ఉన్నారు.

కరెంటోళ్ల నిర్లక్ష్యం.. తల్లీకొడుకులకు శాపం

- అధికారులు బకాయిలపైనే శ్రద్ధ, ప్రమాదాలపై అశ్రద్ధ
- కరెంట్ స్తంభం నుంచి తెగిపడిన విద్యుత్ వైరు
- తృటిలో తప్పిన ప్రాణాప్రాయం
- కోనరావుపేట మండలం నాగారంలో ఘటన

కోనరావుపేట, ఫిబ్రవరి 27 : కరెంట్ అధికారులు విద్యుత్ బకాయిలపైన చూపిన శ్రద్ధ, ప్రమాదాలకు నిలయాలుగా మారిన విద్యుత్ స్తంభాలు తొలగించడం, లూజ్ వైర్లు సరిచేయడం వంటి వాటిపై శ్రద్ధ చూపకపోవడం కొట్టచ్చినట్లు కనబడుతోంది. ప్రమాదాలు సంభవించినప్పుడే స్పందించి, చేతులు దులుపుకుంటున్నారు. దీంతో గ్రామాల్లోని ప్రజలకు, రైతులకు శాపంగా మారింది. ఈ క్రమంలోనే సెస్ అధికారుల నిర్లక్ష్యంతోనే కోనరావుపేట మండలంలోని నాగారం గ్రామంలోని తల్లీకొడుకులు తృటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన బొడ్డ మహిపాల్–సుమ దంపతులు కుమారుడైన ఆద్విక్ (7) గురువారం ఉదయం ఇంటి బయటకు వెళ్లాడు. అప్పటికే ఇంటి ముందు ఉన్న కరెంట్ స్తంభం మేయిన్ వైరు తెగి కింద పడిపోయింది. ఆద్విక్ పడి ఉన్న విద్యుత్ వైరును చేతుతో ముట్టకోవడంతో ఒక్కసారిగా షాక్ కొట్టింది. గమనించిన తల్లి ఉమ షాక్ నుంచి బాలుడిని కాపాడబోయేసరికి ఇద్దరికి కరెంట్ షాక్ తగలడంతో బాలుడి తండ్రి మహిపాల్ కాపా డే ప్రయత్నం చేసి, హెల్పర్ మహేందర్‌కు సమాచారమిచ్చాడు. వెంటనే ట్రాన్స్‌ఫార్మర్ నుంచి కరెంట్ సరఫరా నిలిపేయడంతో అప్పటికే తల్లీకొడుకుకు చేతులు కాలిపోయి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే హుటాహుటిన చికిత్స కోసం కు టుంబ సభ్యులు సిరిసిల్ల ఏరియా దవాఖానకు తరలించారు. అక్కడి నుంచి బాలుడిని కరీంనగర్‌లోని ఓ దవాఖానకు తరలించారు. పరీక్షించిన వైద్యులు ప్రాణపాయం ఏమిలేదని చెప్పడంతో ఊపిరిపీల్చుకున్నారు. ఇప్పటికైనా సెస్ ఉన్నతాధికారులు స్పందించి లూజ్ వైర్లు, ప్రమాదాపుటంచున ఉన్న స్తంభాలను తొలగించి వాటిని సరి చేయాలని స్థానికులు డిమాండ్ చేశారు.

ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో కూలీ మృతి

ముస్తాబాద్, ఫిబ్రవరి 27 : మండలకేంద్రంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన ఒల్లెపు దేవయ్య వ్యవసాయ బావిలో మట్టి (పూటిక) తీసి పైకి వచ్చు క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు తగిలి మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. కుటుంబ సభ్యులు స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒల్లెపు దేవయ్యతో పాటు మరికొందరు వ్యవసాయ బావిలో పూడిగా తీసేందుకు వెళ్లారు. మట్టి తీసి పైకి వచ్చే క్రమంలో చివర ఉన్న ఒల్లెపు దేవయ్యకు విద్యుత్ షాక్ కొట్టడంతో గమనించిన తోటి కార్మికులు దవాఖానకు తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి ముదిరాజ్‌ల చేయూత

గంభీరావుపేట, ఫిబ్రవరి 27 : మండల కేంద్రంలోని గొట్టిముక్కుల కిషన్ బాధిత కుటుంబానికి గురువారం ముదిరాజ్ సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి శంకర్ ఆధ్వర్యంలో సభ్యులు ఆర్థిక చేయూతను అందజేశారు. కిషన్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, ముదిరాజ్‌లు అండగా మేమున్నాం అంటూ బాధిత కుటుంబానికి రూ. 25 వేల నగదుతో పాటు 50 కేజీల బియ్యం అందజేశారు. రానున్న రోజుల్లో కుటుంభ సభ్యులకు అండగా, ఉంటామని వారు భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు శివంది దేవయ్య, మండలాధ్యక్షుడు దేవేందర్, లక్ష్మణ్, సభ్యులు ఈరవేని రమేశ్, పిట్ల బాబు, నర్సయ్య, నర్సింహులు, దేవదాసు ఉన్నారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలంగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా నా క్లయింట్ ఉగిలె అమ్మాయి, భర్త: స్వర్గీయ రఘుపతి గారు ప్రస్తుత నివాసం వేములవాడ, వారి యొక్క సమిష్టి కుటుంబ ఆస్తి విషయమై తన తండ్రి అయిన బావండ్ల లింబయ్య, చిన్న తండ్రి అయిన బావండ్ల బుచ్చయ్య మరియు తన తండ్రి KEPT MISTRESS అయిన బావండ్ల రాధల్లపై కిష్టంపేట మం|| చందుర్తి గ్రామ శివారులో గల వ్యవసాయ భూములు సర్వే నంబర్లు 142 మరియు 146 విషయమై మరియు వేములవాడ గ్రామ రెవెన్యూ పరిధిలో గల సర్వే నంబర్ 1397 లో గల 242 చ.గ.లు భూమిని తన తండ్రి మరియు చిన్న తండ్రి చట్ట విరుద్ధంగా బావండ్ల రాధకు దానసెటిల్‌మెంట్ పత్రములు రిజిష్టర్ చేసినందున, పై ఆస్తులన్నింటిలోను నా క్లయింట్‌కు సగం వాటా చెందవలెనని మరియు బావండ్ల రాధ చట్టవిరుద్ధంగా చేయించుకున్న రిజిష్టర్ దానసెటిల్‌మెంట్ దస్తావేజులను చెల్లని దస్తావేజులుగా ప్రకటించవలెనని గౌరవనీయ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు నందు విభజన కొరకై దావా నెంబర్ 111/2010 ద్వారా దావా వేయగా, గౌరవనీయ కోర్టు వారు పై ఆస్తులలో సగ భాగమునకు నా క్లయింట్ అర్హురాలనీ, మిగతా సగభాగము తన తండ్రి గారు అర్హులనీ మరియు బావండ్ల రాధ పేరున తన తండ్రి మరియు పిన తండ్రిలు వేములవాడ శివారులోని సర్వే నెంబర్ 1397 లో గల 242 చ.గ.ల భూమికి సంబంధించి చేసిన దాన పత్రములు చెల్లవని 2013 సం||లో తీర్పు ఇచ్చియుండిరి. తీర్పు అనంతరము నా క్లయింట్ తండ్రి అయిన బావండ్ల లింబయ్య గారులు మరణించినందున నా క్లయింట్ తప్ప ఇతర వారసులెవరను ఆయనకు లెనందున పైన పేర్కొన్న ఆస్తులన్నిటికి తాను ఒక్కరే యజమాని అయినందున అట్టి వాటికి సంపూర్ణ యజమానురాలుగా అనుభవించుచున్నది. గౌరవనీయ కోర్టు వారు పై విధముగా తీర్పు 2013 సం||లోనే ఇచ్చియుండినప్పటికిని, స్వర్గీయ బావండ్ల రాధ గారు దురుద్దేశ్యంతో నా క్లయింటునకు నష్టం, ఇబ్బంది కల్గించే దురుద్దేశ్యంతో 2021 సం||లో తాను యజమాని కానప్పటికిని తన పేరున చేసిన రిజిష్టర్ దాన పత్రములు చెల్లవని కోర్టువారు తీర్పు చేసినప్పటికిని బుర్ర వెలేందర్ మరియు మ్యాదరి నిరోశా అనే వ్యక్తులకు వేములవాడ శివారులోని 1397 సర్వేనంబర్‌లో గల 242 చ.గ.లు భూమిని, అందులో గల రేకుల షెడ్డు పురపాలక సంఘం ఇవ్వబడిన H.No. 8-5-35/3A తో సహ అమ్మినట్లు చూపెడుతూ SRO కార్యాలయములో రిజిష్టర్ చేసినట్లు నా క్లయింటుకు ఇటీవలనే తెలిసింది. ఇట్టి రిజిష్టర్ సేల్‌డీడ్ ఆధారంగా వారు పై ఆస్తిని ఇతరులకు అమ్మజూపే ప్రయత్నంలో ఉన్నారు. వారికి అమ్మిన వ్యక్తికే పై ఆస్తిపై ఎలాంటి హక్కులు లేనందున కొనుగోలు చేసిన పై వారికి ఎలాంటి హక్కులు రానందున కొనుగోలు దారులెవరను పైన పేర్కొన్న ఆస్తి ఇ.నెం. 8-5-35/3A ను గాని అందులో నుండి కొంత భాగమునకు కొనుగోలు చేయవలదని ఇట్టి ప్రకటనను పట్టించుకోకుండా కొనుగోలు చేసినచో నా క్లయింట్ చట్టరీత్యా తీసుకునే అన్ని చర్యలకు బాధ్యులు కాగలరు.

ఇట్లు: Sd/- G. Bhaskar Reddy, Advocate Sircilla. Cell: 98666 82343

కట్నం కోసం భార్యను వేధించిన భర్తకు జైలు

- రూ. 3 వేల జరిమానా

ముస్తాబాద్, ఫిబ్రవరి 27 : భార్యను అదనపు కట్నం తేవాలని వేధించిన భర్తకు జైలు శిక్ష రూ.3వేల జరిమానా న్యాయమూర్తి ప్రవీణ్ విధించారని ఎస్ఐ గణేశ్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట మండలం పుల్లూరు గ్రామానికి చెందిన వనమా యాదగిరికి ముస్తాబాద్ మండలకేంద్రానికి చెందిన లక్ష్మితో 1996లో వివాహమైంది. వారికి ఇద్దరు అబ్బాయిలు సంతానం కలుగగా, కొన్నేళ్ల తర్వాత అదనపు కట్నం తీసుకురావాలని భార్యను వేధింపులకు గురిచేసేవాడని, దీంతో ఆమె 2015లో ముస్తాబాద్ పోలీస్‌స్టేషన్లో యాదగిరిపై ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా, గురువారం సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. నిందుతుడు యాదగిరిపై నేరం రుజువు కావడంతో ఏడాదిన్నర జైలు శిక్షతో పాటు రూ. 3 వేల జరిమానా విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

కోనరావుపేట: పోలింగ్ సెంటర్‌లో ఎమ్మెల్సీ ఓటు వేసేందుకు క్యూలో నిల్చున్న ఓటర్లు

వేములవాడ : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన ఓటర్లు

వేములవాడ : క్యూలో నిల్చున్న ఓటర్లు

పోలింగ్ ప్రశాంతం

- ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్వచ్ఛందంగా పాల్గొన్న ఉపాధ్యాయులు, గ్రాడ్యుయేట్లు
- కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ అఖిల్ మహాజన్
- ఉదయం నుంచే బారులుదీరిన ఓటర్లు

ఎల్లారెడ్డిపేట: ఓటు హక్కును వినియోగించుకున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య కుటుంబ సభ్యులు

వేములవాడ, ఫిబ్రవరి 27 : వేములవాడ పట్టణంలో కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ జిల్లాలతో కూడిన కరీంనగర్ ఎమ్మెల్సీ ఉపాధ్యాయ, పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ గురువారం ప్రశాంతంగా ముగిసింది. బ్యాలెట్ పేపర్ పద్ధతిన నిర్వహించిన ఈ ఎన్నికల పోలింగ్ కోసం వేములవాడ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొత్తం ఆరు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వేములవాడ అర్బన్ మండలం పట్టభద్రుల ఓటర్ల కోసం నాలుగు పోలింగ్ కేంద్రాలు, ఉపాధ్యాయ ఓటర్ల కోసం ఒక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయగా, వేములవాడ రూరల్ మండలంకు సంబంధించి పట్టభద్రులు, ఉపాధ్యాయ ఓటర్లకు కలిపి ఒకే పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఉదయం 8 గంటలకు పోలింగ్ ప్రారంభం కాగా, మధ్యాహ్నం 12 గంటల వరకు మందకొడిగా కొనసాగింది. ఆ తర్వాత ఓటర్లు పెద్దసంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు తరలిరావడంతో వేగంగా సాగింది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు పట్టభద్రులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా తరలివచ్చారు. బ్యాలెట్ పద్ధతిన పోలింగ్ ప్రక్రియ నిర్వహణలో కొంత జాప్యం, ఓటర్లు కూడా క్యూ లైన్‌లో ఉండడంతో సాయంత్రం ఐదు గంటల వరకు పోలింగ్ నిర్వహించాల్సి వచ్చింది. చిన్నారులతో కలిసి ఓటును వినియోగించుకునేందుకు మహిళలు కూడా తరలివచ్చారు. వేములవాడ అర్బన్ మండలంలో 3426 మంది పట్టభద్రులకుగాను 2455 మంది తమ ఓటు హక్కు వినియోగించుపోవడంతో 71.66 శాతం పోలింగ్ నమోదైంది. 176 మంది ఉపాధ్యాయులకు గాను 169 మంది తమ ఓటు హక్కు వినియోగించుకోవడంతో 96 శాతం పోలింగ్ నమోదైంది. వేములవాడ రూరల్ మండలంలో 970 మంది ఉపాధ్యాయులకు గాను 699 మంది ఓటు హక్కు వినియోగించుకోవడంతో 72 శాతం పోలింగ్ నమోదైంది. 27 మంది ఉపాధ్యాయులకు గాను 25 మంది ఓటు వేయడంతో 90.28 శాతం పోలింగ్ నమోదయినట్లు అధికారులు తెలిపారు. వేములవాడలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌ను వేములవాడ ఆర్డీవో రాజేశ్వర్, తహసీల్దార్ మహేశ్ కుమార్ పరిశీలించారు. ఎస్పీ అఖిల్ మహాజన్, జిల్లా అదనపు ఎస్పీ చంద్రయ్య పోలింగ్ బందోబస్తును పరిశీలించారు. వేములవాడ పట్టణ, వేములవాడ రూరల్ సీఐలు వీరప్రసాద్, శ్రీనివాస్ బందోబస్తును పర్యవేక్షించారు.

కోనరావుపేట, ఫిబ్రవరి 27 : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్సీ పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మండలంలో మొత్తం పట్టభద్రుల ఓటర్లు1496 ఉండగా, 1010 మంది పట్టభద్రులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే కరీంనగర్ డెయిరీ చైర్మన్ చల్మెడ రాజేశ్వర్‌రావు తమ ఓటుహక్కును కోనరావుపేట పోలింగ్ కేంద్రంలో వినియోగించుకున్నారు.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కరువు..

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 363, 364 పట్టభద్రుల పోలింగ్ కేంద్రాలను, 183 ఉపాధ్యాయ పోలింగ్ కేంద్రాన్ని అధికారులు ఏర్పాటు చేశారు. కానీ, ఓటర్లకు కనీస సౌకర్యాలు కల్పించడంలో విఫలమయ్యారు. దీంతో ఎండలోనే గంటల తరబడి క్యూలైన్‌లో నిలుచోని ఉన్నారు. అధికారులు నీడ కోసం కనీసం టెంట్లు కూడా ఏర్పాటు చేయకపోవడంతో పలువురు మహిళా ఓటర్లు చిన్నపిల్లలను ఎత్తుకొని వచ్చి ఇబ్బందులు పడ్డారు. సమస్యను పలువురు ఓటర్లు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

ఓటు వేయని ఉద్యోగులు..

జిల్లాలోని పలువురు పోలీస్ ఉద్యోగులు తమ ఓటుహక్కును వినియోగించుకోలేకపోయారు. మహాశివరాత్రి సందర్భంగా నాలుగు రోజుల పాటు నిరంతరం డ్యూటీలో ఉండడంతో పలువురు తమ పోస్టు బ్యాలెట్ ఓటు హక్కును వినియోగించుకోలేదు. పోలింగ్ కేంద్రాల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి వచ్చిన వారికి పోస్టల్ లిస్ట్‌లో పేరు ఉన్నందున ఓటు వేయరాదని అధికారులు చెప్పడంతో నిరాశతో వెనుదిరిగారు.

రుద్రంగి, ఫిబ్రవరి 27 : మండలంలో మొత్తం 392 పట్టభద్రుల ఓటర్లుండగా 315 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. 81.12 శాతం కాగా, 18 మంది ఉపాధ్యాయ ఓటర్లుండగా 18 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. వంద శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల అధికారి తెలిపారు. మండల కేంద్రంలోని పోలింగ్ బూత్‌ను ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి, సీఐ వెంకటేశ్వర్లు పరిశీలించారు. మాజీ ఎంపీపీ గంగం స్వరూపారాణి–మహేశ్ దంపతులు, మాజీ సర్పంచ్ తర్రె ప్రభలత–మనోహర్ దంపతులు ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ఇల్లంతకుంటలో..

ముస్తాబాద్, ఫిబ్రవరి 27: మండల కేంద్రంలో ఓటర్ల సౌలభ్యం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పట్టభద్రుల ఓటర్లు 1495 కాగా, 1032 ఓట్లు పోలయ్యాయి. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓట్లు 70 కాగా, 68 ఓట్లు పోలైనట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. పోలింగ్ కేంద్రాలు 2 ఉపాధ్యాయ పోలింగ్ కేంద్రం ఒకటి ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ అఖిల్‌మహాజన్ సందర్శించి, పోలింగ్ సరళిని పరిశీలించించారు.

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 27 : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని ఎస్పీ పరిశీలించారు. మండల కేంద్రంలో ఉపాధ్యాయ ఓట్లు 77 ఉండగా 67, పట్ట భద్రుల ఓట్లు 1934 ఉండగా 1305 ఓట్లు పోలయ్యాయని ఎన్నికల అధికారి తెలిపారు. మండలంలో 66 శాతం ఓటింగ్ నమోదైనట్లు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు బీజేపీ నాయకుల మధ్య వాగ్వాదం జరిగింది. డబ్బులు పంచారంటూ ఇరువురు వాగ్వాదం చేసుకోగా, ఎస్ఐ కదిరె శ్రీకాంత్ గౌడ్ సిబ్బందితో అక్కడకు చేరుకుని ఇరు వర్గాలను చెదరగొట్టారు.

చందుర్తి : ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు

చందుర్తి : పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి

చందుర్తి, ఫిబ్రవరి 27: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో పట్టబద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ పోలింగ్ గురువారం ప్రశాంతంగా ముగిసింది. 4 గంటలలోపు క్యూలో ఉన్నవారికి అధికారులు ఓటేసే అవకాశం ఇచ్చారు. టీచర్ ఎమ్మెల్సీ స్థానానికి 100 శాతం పోలింగ్ నమోదు కావడం విశేషం.. మండలంలో 28 మంది ఉపాధ్యాయులకు 28 మంది ఉపాధ్యాయులు 100 శాతం ఓటు హక్కు వినియోగించుకున్నారు. మండలంలో 962 మంది పట్టభద్రులకు గాను 707 మంది పట్టభద్రులు ఓటు హక్కును వినియోగించుకున్నారు.

వీర్నపల్లి, ఫిబ్రవరి 27 : స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా పరిశీలించారు. ఓటింగ్ సరళిని అడిగి తెలుసుకున్నారు. మండలంలో 532 మంది పట్టభద్రులకు గాను 373 మంది ఓటు హక్కు వినియోగించుకోగా 69.71 శాతం పోలింగ్ నమోదైంది. 15 మంది ఉపాధ్యాయులకు గాను 14 మంది ఓటు వేయగా 93.33 శాతం పోలింగ్ నమోదైంది.

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 27: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన ఎంఎల్‌సీ ఓటింగ్ మందకోడిగా ప్రారంభం అయినప్పటికీ మధ్యాహ్నం పుంజుకుంది. మండలంలో 1441 మంది ఓటర్లు ఉండగా 956 మంది, టీచర్ 82 ఓట్లు ఉండగా 77 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు.

పట్టుభద్రుల పోలింగ్ 68.51, టీచర్ పోలింగ్ 94.63 శాతం

ముస్తాబాద్: పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 27 (నమస్తే తెలంగాణ): పట్టుభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ ప్రక్రియ జిల్లాలో ప్రశాంతంగా ముగిసింది. గురువారం ఉదయం 8 గంటల నుంచి ప్రారంభమైన పోలింగ్ సా యంత్రం నాలుగు గంటల వరకు కొనసాగింది. సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాలతో పాటు చొప్పదండి, మానకొండూరు నియోజకవర్గాలలోని బోయినిపల్లి, ఇల్లంతకుంట మండలాల్లో పోలింగ్ నిర్వహణ కోసం అధికార యంత్రాంగం పకడ్బందీ ఏర్పాట్లు చేసింది. పట్టభద్రులు, టీచర్ ఓటర్లు తరలి వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు తమ స్వగ్రామాల్లో ఓటు హక్కును వినియోగించుకున్నారు. కాగా, పట్టభద్రుల పోలింగ్ శాతం కన్నా టీచర్ల పోలింగ్ శాతం ఎక్కువైంది. గ్రాడ్యుయేట్ ఓటర్లు 22, 397 ఉండగా, అందులో 15,344 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 68.51 పోలింగ్ శాతం నమోదైంది. టీచర్ల ఓటర్లు 950 మందిలో 899 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 94.63 శాతం పోలింగ్ నమోదైంది. సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాలతో పాటు చొప్పదండి నియోజకవర్గంలోని బోయినిపల్లి, మానకొండూరు నియోజకవర్గంలోని ఇల్లంతకుంట మండలాల్లో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాలు 28, టీచర్ ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాలు 13 మొత్తం 41 కేంద్రాలను ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పరిశీలించారు. ఎస్పీ అఖిల్ మహాజన్ జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో పర్యటించి శాంతి భద్రతలను స్వయంగా పరిశీలించారు.

ఇల్లంతకుంట : పోలింగ్ కేంద్రానికి పరిశీలిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

రుద్రంగి : ఓటు వేసేందుకు క్యూలో నిల్చున్న ఓటర్లు

వీర్నపల్లి : పోలింగ్ కేంద్రంలో ఓటు వేయడానికి క్యూలో నిల్చున్న పట్టభద్రులు

డీపీవోను కలిసిన ఎంపీడీవో

గంగాధర, ఫిబ్రవరి 27: కరీంనగర్ జిల్లా పంచాయతీరాజ్ అధికారి జగదీశ్వర్‌ను ఎంపీడీవో దమ్మని రాము, మండల పంచాయతీ కార్యదర్శులు గురువారం ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డీపీవోకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. తర్వాత పంచాయతీ కార్యదర్శుల సంఘం డైరీని ఆవిష్కరించారు. ఇక్కడ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఉన్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

అంబటి అమృత(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 27: బైక్‌పై వెనక కూర్చున్న ఓ మహిళ చీర కొంగు వీల్స్‌లో చిక్కుకొని మూడు రోజుల క్రితం గాయాల పాలై చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మండలంలోని పోతిరెడ్డిపల్లిలో జరిగింది. స్థానికులు అందించిన వివరాల ప్రకారం.. పోతిరెడ్డిపల్లికి చెందిన అంబటి అమృత (53) ఈ నెల 23న తన భర్త రాజేందర్‌తో కలిసి శివరాత్రి పండుగ సందర్భంగా వెంకటాపూర్‌కు పూజా సామగ్రి తెచ్చేందుకు కారులో వెళ్లారు. అదే సమయంలో తమ కూతురు కోనరావుపేట మండ లం నిజామాబాద్ నుంచి వస్తున్నట్లు ఫోన్ రాగానే రాజేందర్ సిరిసిల్ల నుంచి తీసుకెళ్లేందుకు సిద్ధమయ్యాడు. ఈ క్రమంలో పోతిరెడ్డిపల్లికి అప్పుడే ఓ వ్యక్తి వెళ్తుండగా అతడి బైక్‌పై తన భార్య అమృతను ఎక్కించి సిరిసిల్లకు వెళ్లిపోయాడు. ఈ క్రమంలో బైక్‌పై కొంత దూరం వెళ్లాక అమృత చీర కొంగు వెనక వీల్‌లో చిక్కుకొని కిందపడిపోయింది. దీంతో తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స కోసం కరీంనగర్‌కు తరలించగా, చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. మరో కూతురు అమెరికాలో స్థిరపడగా ఆమె గురువారం స్వగ్రామానికి చేరుకోగా అంత్యక్రియలు పూర్తి చేశారు.

పోగొట్టుకున్న బంగారు గొలుసు అందజేత

భక్తులకు అందజేస్తున్న పారిశుధ్యసిబ్బంది

వేములవాడ టౌన్, ఫిబ్రవరి 27 : వేములవాడ రాజన్న దర్శనానికి వచ్చిన భక్తులు పార్వతీపురం వసతిగృహంలో అద్దె గదులు తీసుకున్న క్రమంలో ఆ గదిలో మరిచిపోయిన బంగారు గొలుసును ఆలయ పారిశుధ్య సిబ్బంది గురువారం తిరిగి భక్తులకు అందజేశారు. దీంతో ఆ బంగారు గొలుసు తీసుకున్న భక్తుల ఆనందానికి అవధుల్లేవు, వారికి కృతజ్ఞతలు చెప్పి వారిని అభినందించారు. అలాగే రాజన్న ఆలయ పారిశుధ్య సిబ్బంది విభాగాన్ని ఆలయ ఉద్యోగులు అభినందించారు.

సమస్యల పరిష్కారానికి కృషి



విద్యార్థినుల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల

కోరుట్ల, ఫిబ్రవరి 27: కోరుట్ల అల్లమయ్య గుట్ట వ్యవసాయ కళాశాల విద్యార్థినుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల హామీ ఇచ్చారు. కాలేజీలో వసతులు లేవని, ఫ్యాకల్టీ కొరత ఉందంటూ విద్యార్థినులు రెండ్రోజుల కింద ధర్నా చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో గురువారం కళాశాలను ఎమ్మెల్యే సందర్శించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కళాశాలలో మౌలిక సదుపాయాలు లేవని, ఫ్యాకల్టీ కొరత ఉందని, యూనివర్సిటీ గుర్తింపుపై విద్యార్థినులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. సమస్యలను పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేయగా, సంజయ్ కల్వకుంట్ల స్పందించారు. అఫీలీషియన్ విషయంలో పూర్తి బాధ్యత తీసుకుంటున్నట్లు తెలిపారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సదుపాయాలు కల్పించే ఏర్పాట్లు చేస్తామన్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు పేర్ల సత్యం, తదితరులు ఉన్నారు.

పొలానికి నీళ్లు పెట్టేందుకు వెళ్లి.. మృత్యుఒడికి

- పాముకాటుతో రైతు మృతి
- బీరం రాజయ్యపల్లిలో విషాదం

చొప్పదండి, ఫిబ్రవరి 27: పొలానికి నీళ్లు పెట్టేందుకు వెళ్లిన ఆ రైతు పాముకాటు గురై మృతిచెందాడు. ఈ విషాధకర ఘటన గురువారం మండలంలోని రాగంపేట అనుబంధ గ్రామమైన బీరం రాజయ్యపల్లిలో గురువారం చోటుచేసుకున్నది. ఎస్ఐ అనూష తెలిపిన వివరాల ప్రకారం.. ఎర్రం మల్లారెడ్డి(44)కి రాగంపేట శివారులో నాలుగెకరాల పొలం ఉన్నది. రోజువారీ మాదిరిగా మల్లారెడ్డి గురువారం తన వ్యవసాయ పొలానికి నీళ్లు పెట్టేందుకు గట్ల మీద నుంచి వెళ్తుండగా పాముకాటు వేసింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే చొప్పదండి ప్రభుత్వ దవాఖానకు తరలించి యాంటీ ఇంజక్షన్ వేయించారు. పరిస్థితి విషమించడంతో కరీంనగర్ ప్రభుత్వ ప్రధాన దవాఖానకు తరలిస్తుండగా మార్గం మధ్యలో నగునూరుకు చేరుకోగానే మృతి చెందాడు. మల్లారెడ్డి భార్య మంజుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ అనూష తెలిపారు.

జాతర భక్తులకు ఆయుర్వేద వైద్య శిబిరం

జాతర సందర్భంగా ఆయుర్వేద వైద్య శిబిరం

వేములవాడ, ఫిబ్రవరి 27: వేములవాడ రాజన్న సన్నిధిలో జరిగిన మహాశివరాత్రి జాతరలో ఆయుర్వేద వైద్య శిబిరాన్ని నిర్వహించి, వైద్య సేవలు అందించినట్లు గురువారం వైద్యాధికారి స్వరూప, జిల్లా ఇన్‌చార్జి డాక్టర్ శశి తెలిపారు. రెండు రోజుల పాటు వేములవాడ రాజన్న సన్నిధిలో భక్తులకు తమ సేవలు అందించామని వారు తెలిపారు. వైద్యాధికారులు శ్వేత, బీలు కుమారి, ఫార్మసిస్ట్‌లు పుష్పలత, లావణ్య , ప్రవీణ్ కుమార్, యోగా శిక్షకులు కృష్ణ, రిషిక ఉన్నారు.